క్లుప్తంగా

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం



మండపేటలో వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మండపేట: దేశాభివృద్ధికి మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి అందించిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ నాయకులు అన్నారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా స్థానిక కలువపువ్వు సెంటర్‌లోని బీజేపీ జెండా స్తూపం వద్ద ఆయనకు ఘన నివాళులర్పించారు. ఆయన అమలుచేసిన సంస్కరణలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాయని పార్టీ నాయకులు కేవీ వీ సాయిరాం, కోన సత్యనారాయణ, చాత్రాతి జానకిరాంబాబు తదితరులు అన్నారు. మద్దుల సుబ్బారావు, వల్లభినేని రవీంద్రబాబు, ఇళ్ల వెంకటేశ్వరరావు, రాయి వీర్రాజు, ఫణిప్రకాష్, రమణ పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి

కాజులూరు: దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి పాలనలో దేశం పురోగతి సాధించిందని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు సలాది వీరబాబు అన్నారు. బుధవారం కుయ్యేరులో వాజ్‌పేయి ఐదో వర్ధంతిని పురస్కరించుకుని నివాళులు అర్పించారు. నాయకులు నిమ్మన రాజేష్, పుణ్యమంతుల శివాజీ, పోలిశెట్టి శ్రీనివాస్, బండి సంజయ్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

కె.గంగవరం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో రెండో స్థానంలో మండలాన్ని నిలిపేందుకు కృషి చేసిన కె.గంగవరం ఎంపీడీఓ ఎస్.నాగార్జున శ్రీనివాసరావుకు ప్రత్యేక పురస్కారం లభించింది. అమలాపురంలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఎంపీడీఓ పురస్కారంతో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ మేరకు ఎంపీడీఓను ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి తదితరులు అభినందించారు.


పకడ్బందీగా రీసర్వే చేయాలి



జగన్నాథగిరిలో సర్వే రాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

కాజులూరు: జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష రీసర్వేను రెవెన్యూ సిబ్బంది అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కాకినాడ ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ సూచించారు. బుధవారం మండలంలో ఆయన పర్యటించారు. జగన్నాథగిరిలో భూ సర్వేలో భాగంగా రెవెన్యూ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే రాళ్ల ఏర్పాటును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ రెవెన్యూ డివిజన్లో ఎంపిక చేసిన 121 గ్రామాల్లో రీసర్వే పూర్తిచేసి మక్కు రాళ్లు వేస్తున్నామన్నారు. కాజులూరు మండలంలో 19 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తికాగా ఆరు గ్రామాల్లో రాళ్లు వేసే పని జరుగుతుందన్నారు. సర్వే నిర్వహణలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే బీవీవీ రాజు, తహసీల్దార్ బి.సాయి సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కె.సుబ్బారావు, ఆర్ఐ వేగేశ్వరరావు, వీఆర్వో గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మండపేటలో మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి కోరారు. బుధవారం స్థానిక 28వ వార్డు సర్దార్ వేగుళ్ల వీర్రాజు మున్సిపల్ హైస్కూల్‌లో మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ ఆధ్వర్యంలో నా భూమి- నాదేశం కార్యక్రమానికి చైర్‌పర్సన్ దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశం కోసం పోరాడిన అమరవీరులను స్మరించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో దుర్గారాణి మొక్కలు నాటారు. కౌన్సిలర్లు మొండి భవాని, నీలం దుర్గ, శెట్టి కళ్యాణి, మారిశెట్టి సత్యనారాయణ, నాయకులు అమలదాసు రుద్రమూర్తి, జొన్నపల్లి సత్తిబాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంటతో ప్రయోజనాలెన్నో..

- జియో ఫెన్సింగ్‌తో కచ్చితమైన వివరాలు
- 1.01 లక్షల ఎకరాల్లో వరి సాగు
- వచ్చే నెల 15 వరకూ గడువు



రాయవరంలో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

రాయవరం: రైతులు సాగులో సిరులు కురిపించేందుకు ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోంది. ఈ-పంట విధానంతో అర్హులంతా పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం కల్పిస్తోంది. దీనికి గాను ఈ-కర్షక్‌లో తప్పనిసరిగా సాగు వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఉన్న విధానంలో ప్రభుత్వం మార్పులు చేసింది. ఈ ఏడాది ఈ-పంట నమోదులో కొత్తగా జియో ఫెన్సింగ్ విధానాన్ని తీసుకు వచ్చింది. దీని ద్వారా రైతు, కౌలు రైతులకు ప్రయోజనం కలుగుతుంది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలో ఖరీఫ్‌లో 1,01,785 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఈ-కర్షక్‌ను వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు సచివాలయ ఉద్యోగులు కలిపి చేస్తున్నారు. దీనిని ప్రత్యేక యాప్‌లో నమోదు చేయడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ- కర్షక్‌లో నమోదైన రైతు సెల్‌కు డిజిటల్ ఎక్నాలెడ్జ్‌మెంట్ వెళ్తుంది. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా ఫిజికల్ ఎక్నాలెడ్జ్‌మెంట్ కూడా ఇవ్వనున్నారు.

అండగా నిలిచేందుకు..

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను రైతులు అతివృష్టి, అనావృష్టితో ఎప్పటికప్పుడు నష్టపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో వారు పరిహారం పొందేందుకు అధికారులు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరిగేవారు. వీరి కష్టాలను గుర్తించిన ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సిబ్బందితో రైతు ఫొటోతో పాటు పొలం వద్దే వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా జియో ఫెన్సింగ్ విధానం అమలు చేస్తున్నారు. కచ్చితంగా రైతు పొలం వద్దకే వెళ్లి, వివరాలు నమోదు చేస్తేనే యాప్‌లో ఎంటర్ అవుతుంది. దీనివల్ల ప్రభుత్వానికి కచ్చితమైన సమాచారం చేరుతుంది. ఈ-పంట ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతాయి. ప్రస్తుతం వ్యవసాయ సిబ్బంది ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వచ్చే నెల 15వ తేదీతో గడువు ముగుస్తున్నందున రైతులు త్వరపడాలని వ్యవసాయ శాఖ సూచిస్తుంది.

ప్రయోజనం ఇలా..

ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం, కార్యక్రమం ఈ కర్షక్ మీదే ఆధారపడి ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏ పంటలు దెబ్బతిన్నాయో స్పష్టమవుతుంది. రైతుకు ఉచిత పంటల బీమాతో పాటు పంట విక్రయాలకు మద్దతు ధర లభిస్తుంది. ఇన్‌పుట్ రాయితీ, పంటల బీమా, సున్నా వడ్డీకే పంట రుణాలు తదితర ప్రయోజనాలు పొందే వీలుంటుంది. ఎరువులు, యాంత్రీకరణ పరికరాలు తదితర పథకాలలో రైతులకు ప్రయోజనం కలుగుతుంది. రైతులు నేరుగా గ్రామ సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి సాగు చేసిన పంట, విస్తీర్ణం, సర్వే నంబరు, ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, ఫోన్ నంబరు వివరాలతో నమోదు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. తొలుత యాప్‌లో ఆధార్‌తో రైతుల పేర్లు ఎంటర్ చేస్తారు. వెంటనే రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో చూపిస్తాయి. ఈ-కర్షక్ యాప్‌లో రైతుల వివరాలు నమోదు చేసిన అనంతరం క్షేత్ర స్థాయిలో రైతు పొలం వద్ద ఫొటోను నమోదు చేస్తారు.

మండలం	గ్రామాలు	సాగు విస్తీర్ణం	రైతులు (ఎకరాల్లో)
రామచంద్రపురం	25	18,806	9,737
కె.గంగవరం	26	15,633	8,700
కాజులూరు	26	19,382	17,200
మండపేట	12	16,985	11,042
రాయవరం	12	14,646	12,002
కపిలేశ్వరపురం	19	16,333	7,200

సద్వినియోగం చేసుకోండి



ఈ-పంటలో ప్రతి రైతు తమ వివరాలను పక్కాగా నమోదు చేసుకోవాలి. రైతు భరోసా కేంద్రాల ద్వారా సిబ్బంది నమోదు చేస్తారు. దీని ఆధారంగానే రాయితీలు అందుతాయి. ఈ నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా యంత్రాంగం పర్యవేక్షణ చేస్తుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

అలీ అక్బర్‌కు ఘన నివాళి



ద్రాక్షారామలో అలీ అక్బర్ గుమ్మటాన్ని ఊరేగిస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా 28వ రోజు ఇమామ్ హుస్సేన్ రెండో కుమారుడు అలీ అక్బర్ సంతాప దినాన్ని ద్రాక్షారామలో ముస్లింలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. యూపీ నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా కల్బే రుషైద్ రిజ్వి మజిలీస్‌ల రూపంలో అలీ అక్బర్ వీరోచిత పోరాటాన్ని, ఛాతిలో బల్లెం గుచ్చుకుని అసువులు బాసిన ఉదంతాన్ని వివరించారు. ఆగావారి వీధి నుంచి మసీద్ సెంటర్ వరకు మాతం జరుపుకొంటూ అలీ అక్బర్ గుమ్మటాన్ని ఊరేగించారు. అంజుమనే సహజాదే అలీ అక్బర్ కమిటీ సభ్యులు, ముస్లిం యువత, పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ముస్లిం భక్తులు తరలివచ్చారు. అంజుమనే కమిటీల ఆధ్వర్యంలో భోజన, వసతి ఏర్పాట్లు చేశారు.

ఆరోగ్య సంరక్షణకు కృషి



తాళ్లపొలంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లు అందజేసిన సర్పంచ్ గోవిందు

రామచంద్రపురం రూరల్: తాళ్లపొలం సచివాలయ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు బుధవారం గ్రామ సర్పంచ్ కట్టా గోవిందు, ఎంపీటీసీ సభ్యుడు పంపన ఏడుకొండలు చేతుల మీదుగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లు శివ, వార్డు సభ్యుడు పితాని ఏడుకొండలు (పానకాలు), అంగన్‌వాడీ కార్యకర్తలు కొప్పిశెట్టి దుర్గ, ఎస్‌కే రహీ ఉన్నీషా, కె.మంగాదేవి, పి.మంగారత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికకు సర్వం సిద్ధం



తాపేశ్వరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజు

మండపేట: తాపేశ్వరం పంచాయతీ 14వ వార్డు సభ్యత్వానికి 19న ఉప ఎన్నిక జరుగనుంది. దీని కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడిద 1వ వార్డు, తాపేశ్వరం 14వ వార్డు సభ్యుల మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఏడిద పంచాయతీకి సంబంధించి అడపా నీలజ్యోతి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో పరిశీలన అనంతరం ఆమె ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి, ఎంపీడీఓ ఐ.రాజు ప్రకటించారు. తాపేశ్వరం పంచాయతీకి సంబంధించి వార్డు బీసీ జనరల్ రిజర్వు కాగా మొత్తం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. స్క్రూటినీలో ఒకటి తిరస్కరణకు గురికాగా ఇరువురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఇరువురు పోటీలో నిలవడంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు చర్యలు చేపట్టారు. బరిలో నిలిచిన మేడిశెట్టి వీరేంద్రకు గౌను గుర్తు, పెంకే కనకలింగేశ్వరరావుకు ప్రెషర్ కుక్కర్ గుర్తులను కేటాయించారు. తాపేశ్వరం శివారు పేకేటిపాకలులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ రాజు పరిశీలించి పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. 19న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ అనంతరం అదే రోజు మధ్యాహ్నం ఓట్లు లెక్కించి విజేతను ప్రకటిస్తారు. వార్డు పరిధిలో మొత్తం 504 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



వడ్లమూరులో సచివాలయ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. బుధవారం వడ్లమూరులో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు, సర్పంచ్ చుండ్రు మంగాయమ్మ, ఎంపీటీసీ పలివెల మధులతో కలసి పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.23.95 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకేను ఆయన ప్రారంభించారు. రూ.15 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్, రూ.15 లక్షలతో రజక కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ అభివృద్ధి జరగలేదంటూ విమర్శలు చేసేవారు గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన కార్యాలయాలు, పాఠశాలలు, సామాజిక భవనాలను చూసి మాట్లాడాలన్నారు. అన్ని రంగాలపై పూర్తి అవగాహనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని పాలిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చుండ్రు అమ్మన్న, ముత్యాల సతీష్, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, నాయకులు రెడ్డి రుద్రమూర్తి, మాచర మాలయ్య తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



సంఘ అధ్యక్షుడు శ్రీనివాసరావును అభినందిస్తున్న నాయకులు

మండపేట: నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షునిగా కపిలేశ్వరపురం మండలం తాతపూడికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొప్పిశెట్టి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గంతో పాటు ఆలమూరు మండలానికి చెందిన శెట్టిబలిజ సంఘం నాయకులు బుధవారం స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపంలో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా యాండ్ర ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శిగా మేడిశెట్టి వెంకటసాయి, సంయుక్త కార్యదర్శులుగా గుత్తుల శ్రీనివాస్, వాసంశెట్టి గాంధీ, 37 మంది ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, పట్టణ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, వీరాంజనేయ దేవస్థానం కమిటీ చైర్మన్ సూరంపూడి సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ నేత కుడిపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే



కపిలేశ్వరపురంలో బీఎల్‌ఓలకు సూచనలిస్తున్న తహసీల్దార్ సూర్యారావు

కపిలేశ్వరపురం: మండలంలో ఓటరు సర్వేను పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ కొమరం సూర్యారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఓటరు సర్వే కార్యక్రమ సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది, బూత్ లెవెల్ ఆఫీసర్లు నిబంధనల మేరకు నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఓటు హక్కు కలిగినవారు నివాస పరిస్థితులు, వలస వెళ్లడం, 18 ఏళ్లు నిండినవారికి ఓటు హక్కు కల్పించడం, ఓటరు జాబితాలో పేర్ల తొలగింపు, మార్పులు తదితర అంశాలపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరికీ కల్పించాలన్న లక్ష్యంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక



ఫెలోషిప్ కొత్త కార్యవర్గ సభ్యులు వీరే..

రామచంద్రపురం: యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆఫ్ రామచంద్రపురం నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. స్థానిక జీసెస్ ప్రేయర్ హౌస్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. సంఘ అధ్యక్షుడిగా ఏపీ స్టేట్ థియోలాజికల్ బైబిల్ కాలేజీ ప్రిన్సిపాల్ తలారి భూషణం, గౌరవాధ్యక్షుడిగా పి.జేమ్స్, ఉపాధ్యక్షుడిగా వి.స్టీఫెన్‌కుమార్, కార్యదర్శిగా వై.బెన్నీబాబు, సహాయ కార్యదర్శిగా భోగేష్ ప్రభుకుమార్, కోశాధికారిగా కె.సమర్పణరావు, ముఖ్య సలహాదారులుగా ఎం.జీవనప్రసాద్, ఆర్‌పీ జాషువా, వి.జాన్‌బెన్నీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సహాయ కార్యదర్శి భోగేష్ విలేకరులకు తెలిపారు.

బాలిక శస్త్రచికిత్సకు సాయం



సుశీలకు సాయం అందజేస్తున్న పద్మశాలి యువసేన సభ్యుడు శ్రీనివాసరావు తదితరులు

అనపర్తి: ఓ బాలిక కాలికి శస్త్రచికిత్స నిమిత్తం బుధవారం సాయం అందించినట్లు పద్మశాలి సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు, యువసేన సభ్యుడు పెనుగొండ శ్రీనివాసరావు తెలిపారు. రాయవరం మండలం మాచవరానికి చెందిన కట్టా ప్రభావతి పడిపోవడంతో ఆమె కాలు మూడు చోట్ల విరిగింది. చిన్నతనంలోనే ఆమె తండ్రి మరణించడంతో తల్లి సుశీల కూలి పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న పద్మశాలి యువసేన సభ్యులు రూ. 28 వేల ఆర్థిక సాయం చేశారు. సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హామీ ఇచ్చారని యువసేన ప్రతినిధులు తెలిపారు.

పేదలకు ప్రభుత్వ పథకాలే అండ

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వడ్లమూరులో గడప గడపకూ..



వడ్లమూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేదలకు కొండంత అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వడ్లమూరులో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్మించారు. సర్పంచ్ చుండ్రు మంగాయమ్మ, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు, ఎంపీటీసీ పలివెల మధు తదితరులతో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి అందిన లబ్ధిని సచివాలయ ఉద్యోగులు తెలిపారు. అర్హులందరికీ పథకాలు చేరేలా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రభుత్వం తీసుకువచ్చిందని ఎమ్మెల్సీ తెలిపారు. సర్పంచులు వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జుత్తుక వెంకటలక్ష్మి, శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, యర్రంశెట్టి నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు ఆచంటి వీవీ స్వామి, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనపర్తి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, 11 కేవీ లైన్‌లో చెట్టు కొమ్మల తొలిగింపు నిమిత్తం 18వ తేదీ శుక్రవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ స్థానిక ఇందిరానగర్, మార్కండేపురం, మెయిన్ రోడ్డు, మార్కెట్ రోడ్, శేషగిరిరావుపేట, కెనాల్ రోడ్డు ప్రాంతాలతో పాటు మండలంలోని కొప్పవరం, లక్ష్మీనరసాపురం, మహేంద్రవాడ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 10 నుండి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకూ అనపర్తి పాతవూరు ధరణికోట, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ ప్రాంతాల పరిధిలో సరఫరా నిలిపివేయనున్నామని అన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.



కె.గంగవరంలో మబ్బులతో నిండిన ఆకాశం

హాయి.. హాయి

నాలుగు రోజులుగా ఉక్కపోత, ఎండలతో జనం అల్లాడారు. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతంగా మారి ఈదురుగాలులు, ఉరుముల వాతావరణం హాయినిచ్చింది. సుమారు అర గంట పాటు వర్షం కురిసింది.

చల్లబడడంతో ప్రజలు డాబాలపై చేరి గాలులను ఆస్వాదించారు. ఎండ తీవ్రతతో వృద్ధులు, చంటి పిల్లలు సతమతమవుతున్న తరుణంలో ఈ మార్పు ఉపశమనం కలిగించింది.

– కె.గంగవరం